క్లుప్తంగా

బస్సు, లారీ ఢీ



తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటన సోమవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తెనాలి నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మండలంలోని సంగం జాగర్లమూడి వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ముందు వెళ్తున్న వాహనాన్ని లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఘటనలో ఆర్టీసీ బస్సు, లారీ ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఘటన గురించి ఆరా తీస్తున్నారు.

అగ్నాస్త్రం కషాయంతో మేలు



వల్లభాపురం(కొల్లిపర): జొన్న, మొక్కజొన్న పంటల్లో వచ్చే కాండం తొలిచే, కత్తెర పురుగులను అగ్నాస్త్రం కషాయంతో నివారించవచ్చని మాస్టర్ ట్రైనర్ గుర్రం నాగకృష్ణ చెప్పారు. సోమవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో దాసరి రత్న భాస్కర్ జొన్న పంటలో ప్రకృతి సేద్యం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ నాగకృష్ణ మాట్లాడుతూ అగ్నాస్త్రం తయారీకి ఆవు మూత్రం 10 లీటర్లు, వేప ఆకులు 5 కిలోలు, పచ్చిమిర్చి కిలో 500 గ్రాములు, వెల్లుల్లి కిలో 500 గ్రాములు, జిల్లేడు ఆకులు కిలో కొలతల ప్రకారం తీసుకొని వాటిని మెత్తగా ముద్దగా నూరి 20 లీటర్ల మట్టి కుండలో కషాయం ఉంచి 3 పొంగులు వచ్చే వరకు వేడి చేసి అనంతరం 4–8గంటల తరువాత ఎకరానికి 5 నుంచి 7 లీటర్ల వరకు పిచికారీ చేయాలని సూచించారు.

విశాఖ ఉక్కును రక్షించండి
సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



తెనాలిటౌన్: విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు నినాదంతో ప్రజలు ముందుకు వచ్చి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖలో 600 రోజులకు చేరుకున్న దీక్షకు సంఘీభావంగా ఈ నెల 24 నుంచి 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24న తెనాలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా జరుగుతుందని చెప్పారు. మండల స్థాయిలో 26 వరకు ధర్నాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొల్లిముంత కృష్ణ, చెరుకుమల్లి సింగారావు, పాశం వెంకటేష్, కిరణ్‌బాబు, బాలస్వామి, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. చెంచుపేటలో ఓ వ్యక్తి మద్యం తరలిస్తుండడాన్ని ఎస్ఈబీ ఎస్ఐ వినితా రెడ్డి, సిబ్బంది గుర్తించారు. అతన్ని సోదా చేయగా 10 క్వార్టర్ సీసాల మద్యం లభించింది. నిందితుడిని తెనాలి మండలం గుడివాడకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్ట్ చేశారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



కొల్లిపర: విద్యార్థులు ఆటల్లో చురుగ్గా పాల్గొంటే ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ కూడా అలవడుతుందని అవుతు రామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు, అవుతు కృష్ణారెడ్డి, వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణ చెప్పారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణ సహకారంతో సోమవారం అవుతు రామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థినులకు ఖోఖో, బాలురకు క్రికెట్ పోటీలు స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులకు అందించే సౌకర్యాలను ఇక్కడ జరిగే పోటీల్లో పాల్గొనే వారికి కల్పిస్తున్నట్టు వివరించారు. నియోజకవర్గంలో గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. తొలుత కళాశాల ఆవరణలో ఉన్న అవుతు రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖోఖో, క్రికెట్ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అవుతు రామిరెడ్డి కళాశాల మాజీ ప్రిన్సిపాల్ వింత మోహన్‌రెడ్డి, అక్షయ్, పారిశ్రామికవేత్త కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, మాజీ ఎంఈఓ బసవకుటుంబరెడ్డి పాల్గొన్నారు.

అంగలకుదురు అభివృద్ధికి అగ్రతాంబూలం

- మునుపెన్నడూ జరగని ప్రగతి మూడున్నరేళ్లలోనే సాకారం
- టీడీపీకి అనుకూల గ్రామమైనా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల అమలులోనూ అదే జోరు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు నిదర్శనం

తెనాలిరూరల్: రూరల్ మండలం అంగలకుదురు.. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి అత్యధిక మెజారిటీనిచ్చే గ్రామం. కానీ ఇది అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ మూడున్నరేళ్లలో గణనీయమైన ప్రగతికి నోచుకుంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో గ్రామం అటు అభివృద్ధి, ఇటు సంక్షేమంలో అగ్రపథాన దూసుకెళుతోంది.

తెనాలి మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన అంగలకుదురు ఆది నుంచి టీడీపీకి అనుకూలం. ఆ పార్టీ సానుకూల సామాజికవర్గందే ఇక్కడ ఆధిపత్యం. ఎన్నికల సందర్భంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఈ గ్రామం అత్యధిక మెజార్టీనిస్తుంటుంది. అయినా టీడీపీ ఏలుబడిలోనూ ఈ గ్రామం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఇక్కడి పంచాయతీ సారథులు అనుకూలం కాకున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో ఈ గ్రామం, మూడున్నరేళ్లుగా ప్రగతి పథంలో దూసుకెళుతోంది. అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగులు పెడుతున్నాయి.



గ్రామ కూడలిలో కొత్తగా నిర్మించిన ద్వారం

ఇవిగో నిదర్శనాలు

- అంగలకుదురు నుంచి కోపల్లె–గుడివాడ వరకు అంగలకుదురు–కొలకలూరు ఆర్అండ్‌బీ రోడ్డును రూ.రెండు కోట్లతో ప్రత్యేక మరమ్మతులు చేయించారు.
- అంగలకుదురు సెంటరు నుంచి రైల్వే స్టేషన్ వరకు జెడ్పీ హైస్కూలు మీదుగా సీసీ రోడ్డును ఇటీవల నిర్మించారు. దీనిని గతనెల 27న స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు.
- రూ. 50 లక్షలతో అంగలకుదురు– కొలకలూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పల్లెకు వెళ్లే రోడ్డును నిర్మించారు.
- వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కేవలం అంగలకుదురు గ్రామంలోనే రూ.20.77 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు.
- 2019 ఎన్నికలకు ముందు గ్రామంలో 820 మందికి పింఛన్‌లు వచ్చేవి. ప్రస్తుతం 1,125 మంది నెలనెలా ఒకటో తేదీన పింఛన్ అందిస్తున్నారు.
- జనవరి ఒకటో తేదీ నుంచి మరో 53 మందికి కొత్తగా పింఛన్ అందుతోంది.
- అమ్మఒడి ద్వారా గ్రామంలో 1,661 కుటుంబాలకు, వసతి దీవెన, విద్యా దీవెన ద్వారా 706 మంది విద్యార్థులకు రూ.1,71 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 1136 మందికి లబ్ధి చేకూరింది. కాపునేస్తం ద్వారా 220 మందికి రూ.33 లక్షలు, వాహన మిత్ర ద్వారా 225 మందికి ప్రయోజనం కలిగింది. 2,380 రైతు కుటుంబాలకు రైతు భరోసా ద్వారా రూ. 3,10 కోట్లు, సున్నా వడ్డీ కింద రూ.7.44 లక్షలు లబ్ధి చేకూరింది. ఈబీసీ నేస్తం ద్వారా 89 మందికి సంక్షేమ ఫలాలు అందాయి. ఇప్పటికే గ్రామంలో 315 మందికి నివేశన స్థలాలు మంజూరయ్యాయి. త్వరలో మరికొంత మందికి స్థలాలను ఇచ్చేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



ఇటీవల నిర్మాణం పూర్తయిన బీటీ రోడ్డు

రోడ్ల అభివృద్ధి నిజమే..



గ్రామంలో రోడ్ల అభివృద్ధి జరిగిన మాట వాస్తవమే. ప్రధాన రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు. పల్లెకు వెళ్లే దారిలో బీటీ రోడ్డు వేశారు. ఇంకా మురుగు కాల్వల నిర్మాణం చేయాల్సి ఉంది. గ్రామంలో మురుగునీటి పారుదల సక్రమంగా జరగటం లేదు.

– ఊసరపు రాజ్యలక్ష్మి, అంగలకుదురు టీడీపీ బలపరిచిన సర్పంచ్

ఎమ్మెల్యే శివకుమార్ చొరవతోనే..



అంగలకుదురులో పాతికేళ్లుగా జరగనంత అభివృద్ధి ఈ మూడున్నరేళ్లలో చేయగలిగాం. ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలు పెద్ద ఎత్తున అందిస్తున్నాం. అంగలకుదురు అభివృద్ధి అంటే సమీపంలోని మూడు నాలుగు గ్రామాల ప్రజలకు ప్రయోజనంగా ఉంటుంది. అంగలకుదురులో తుంగభద్ర డ్రెయిన్‌పై కూలిన వంతెనకు మరమ్మతులూ పూర్తిచేశాం.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం



డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగించడంపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సేవా ట్రస్ట్ హర్షం వ్యక్తంచేసింది. ఈనెల 24తో సబ్‌ప్లాన్ గడువు ముగియనుండగా, ఒకరోజు ముందే పొడిగింపు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునకు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చూపిన ప్రత్యేక శ్రద్ధ వల్ల ఈ మూడున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీలు పొందిన లబ్ధి గతంలో ఎన్నడూ లేదని అబ్రహాం లింకన్ తెలిపారు. ఎస్సీల కోసం గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.33,625.49 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్లలోనే ఎస్సీల అభ్యున్నతికి రూ.48,899.66 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ఎస్టీల కోసం గత ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం రూ.12,487.48 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.15,589.38 కోట్లు వ్యయం చేసినట్టు వివరించారు. మళ్లీ ఇప్పుడు పదేళ్లపాటు పొడిగిస్తూ సంక్షేమ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపునకు ఆమోదం తెలిపిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కఠెవరం గ్రామ కాల్వకట్ట రోడ్డులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5,400 స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వానికి విశేష ప్రజాదరణ

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభం

తెనాలిఅర్బన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న ప్రజలు సంక్షేమ సర్కారుపై విశేష ఆదరణ చూపిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 28వ వార్డు సుందరయ్య కాలనీ నుంచి సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో ప్రతి ఇల్లూ పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో 1,683 నివాసాలు ఉండగా సుమారు ఐదు వేల మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరికి ఇప్పటి వరకు రూ.19.24 కోట్ల మేర వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. అమ్మ ఒడి ద్వారా 356 మంది, రైతు భరోసా ద్వారా 344 మంది, వైఎస్సార్ చేయూత ద్వారా 200 మంది, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 136 మంది, ఇళ్ల స్థల పట్టాల ద్వారా 482 మంది ప్రయోజనం పొందారు. అగ్రిగోల్డ్ సాయం 60 మందికి అందినట్టు చెప్పారు. సుందరయ్య కాలనీలో విద్యుత్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, షేక్ దుబాయ్ బాబు, షేక్ ఇస్మాయేల్, పేరం సంజీవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, 28వ వార్డు నాయకులు శెట్టి యేసోబు, పేరుబోయిన శివ, పందాల జాన్‌పాల్, అహ్మద్, చదలవాడ శ్రీనివాసరావు, బెంజిమేన్, సుమన్, శెట్టి రాజా, నందివెలుగు సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఎంపీటీసీ సీలార్ జానీ, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, కోలా వాసు, అక్కిదాసు కిరణ్‌కుమార్, కనపర్తి అబ్రహాం లింకన్, కుక్కల ముక్తేశ్వరరావు, ఈద్గా గౌస్, కాకి దేవ సహాయం, అడుసుమల్లి శ్రీనివాసరావు, బండ్లమూడి భాస్కరరావు, కాళిదాసు వెంకట సత్యం, కాళిదాసు వెంకటేశ్వరరావు, నాలాది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 121 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, ప్రిన్సిపాల్ రామ్‌చంద్

తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ఫైనలియర్ విద్యార్థులు 121 మంది ప్రపంచ ప్రఖ్యాత పిరామల్ ఫైనాన్స్ సంస్థలో ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం రూ.2.50 లక్షలు. ఆర్నెల్ల శిక్షణ తర్వాత ఇచ్చే పొజిషన్ ప్రకారం వేతనం నిర్ణయిస్తారు. కాలేజిలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వివరాలు తెలియజేశారు. కేవలం ఐటీ కంపెనీలే కాకుండా ఇతర సంస్థల అవసరాలను గుర్తిస్తూ, అవసరమైన శిక్షణ కోసం టెక్నాలజీ సంస్థలు, వర్చువల్ ట్రైనింగ్ సంస్థలతో అవగాహన ఒప్పందాలను చేసుకుంటున్నామని చెప్పారు. ఆ ఫలితంగానే ఐటీ రంగంతోపాటు బ్యాంకింగ్, మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ టీచింగ్ సహా పలు కంపెనీల్లో తమ విద్యార్థులు ఉపాధి అవకాశాలను సాధిస్తున్నట్టు గుర్తుచేశారు. ఐటీ కంపెనీల్లో రిక్రూట్‌మెంట్ తగ్గిన ప్రస్తుత పరిస్థితుల్లో తొలిసారిగా ఫైనాన్స్ సంస్థలో ఏకంగా 121 మంది ఉద్యోగాలకు ఎంపిక కావటం గర్వకారణమన్నారు. యూనివర్శిటీ సిలబస్‌తోపాటు వివిధ అంశాలపై శిక్షణనిస్తూ క్యాంపస్ ఉద్యోగాలతో తల్లిదండ్రులు, విద్యార్థుల కలలు సాకారమయ్యేలా చూస్తున్నామని వివరించారు. వీరితో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఉన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



గాంధీచౌక్‌లో..



వహాబ్‌చౌక్‌లో..

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లో పలుచోట్ల నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. నందివెలుగులో మిద్దె సెంటర్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు తోటకూర కోటేశ్వరరావు, శిఖా రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని గాంధీచౌక్‌లోని నేతాజీ విగ్రహం వద్ద బీజేపీ నాయకుడు అడపా సంపత్‌రాయుడు, పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వహాబ్‌చౌక్‌లో మోటార్ మెకానిక్స్, పౌండ్రీ, పంచర్, వాటర్ వాష్, పెయింటింగ్, వెల్డింగ్, వైరింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి కార్మికులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కలశాలను అందజేస్తున్న పాలకవర్గ బాధ్యులు



అమ్మవారి శోభాయాత్ర

తెనాలి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేషపూజలు చేశారు. ఉదయం 5.30 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారికి సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ చేశారు. ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు వైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అమ్మవారికి 11 పర్యాయాలు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. 102 మంది ఆర్యవైశ్య కన్యలకు 102 పూజా కలశాలను అప్పగించగా, ఇంకా పలువురు సొంత కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన సింహ వాహనంపై అమ్మవారు ఆశీనులు కాగా, పురవీధుల్లో శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, వుప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు, భాస్కరుని శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, గొడవర్తి హరేరామ్, చుండూరు సాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, వెచ్చా నాగరాజారావు, చుండూరు వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవిద్యాపీఠంలో..

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో పూజ్య బాల స్వామీజీ పర్యవేక్షణలో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బాలస్వామీజీ అమ్మ విశిష్టతను వివరించారు. వరి కంకులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, చుండూరు లోకనాథం, గోపు రామకృష్ణ, వుప్పల నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

- వాసవీ క్లబ్ తెనాలి, వాసవీ క్లబ్ వనిత తెనాలి గ్రేటర్ క్లబ్స్ ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి సారె సమర్పించారు. బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ తెనాలి ప్రెసిడెంట్ బాల గణేష్, సెక్రటరీ రమేష్‌బాబు, కోశాధికారి కామేశ్వరరావు, క్లబ్ గవర్నర్ జయంత్‌కుమార్, మాడా వెంకట సుబ్బారావు, వాసవీ క్లబ్ వనిత తెనాలి గ్రేటర్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



శ్రీవిద్యాపీఠంలో వరి కంకుల అలంకరణలో..

వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో..

తెనాలిటౌన్: వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. మారీసుపేటలోని బాలత్రిపుర సుందరీ, చంద్రమౌళేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం రాత్రి 102 మంది ఆర్యవైశ్య కన్యలచే విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా మహిళలు, నిర్వాహకులు పూజలు జరిపారు. కార్యక్రమాన్ని కల్యాణ మండపం అధ్యక్షులు వరద వెంకట శేషగిరిరావు, కార్యదర్శి పెండేల సుబ్బారావు, కోశాధికారి గ్రంథిసేతు మాధవరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రేపు భద్రావతీ సమేత భావనారుషి కల్యాణం

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరి పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి కల్యాణం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

27,28 తేదీల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27,28 తేదీల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఫాదర్ చిన్నప్ప, ఫాదర్ జోస్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటలీ దేశానికి చెందిన విద్యావేత్త పునీత జాన్‌బాస్కో వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ పోటీలకు ప్రతి ఒక్క పాఠశాల నుంచి ఒక బాలుర, బాలికల జట్టు మాత్రమే పాల్గొనాలని, పాల్గొనదలచిన జట్టు ఒక్క ఆటకు రూ.300 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 24న పాఠశాల ఆవరణలో డ్రా తీస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరు కావాలని కోరారు.

రేడియో, టీవీ ఆర్టిస్ట్ మంజునాథఈశ్వర్‌కు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం ఒకే కుటుంబం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం అక్బర్ సలీం అనార్కలి చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ రేడియో, టీవీ ఆర్టిస్ట్ దేవిశెట్టి మంజునాథఈశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఊసరపు రాజ్యలక్ష్మి, చెన్నుపాటి తేజశ్రీ, నలురుర్తి విజయ, దేవిశెట్టి శ్రీలక్ష్మి, కనగాల శ్రీనివాస్, దేవిశెట్టి రాంబాబు, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, గనిపిశెట్టి గోపి, నరసింహరావు, కన్నెగంటి మధు, రామరాజు, టంకశాల సంగమేశ్వర్, సోమవరపు సాంబశివరావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంజునాథ ఈశ్వర్‌ను సన్మానిస్తున్న రాజ్యలక్ష్మి, తేజశ్రీ తదితరులు

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం



వేదికను పరిశీలిస్తున్న కత్తెర సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు

తాడికొండ: తాడికొండలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు తాడికొండ అడ్డరోడ్డులోని వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. సమావేశానికి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి పలువురు నాయకులు హాజరుకానున్నారని వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు వీరు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.